లాకర్ కావాలా నాయనా..?

రాజధర్మం

ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో చార్జీలెంత?



నగలు, డాక్యుమెంట్ల వంటి విలువైనవాటి కోసం నమ్మదగిన బ్యాంకింగ్ సేవల్లో సేఫ్ డిపాజిట్ లాకర్లదే కీలకపాత్ర. అందుకే ఇటీవలికాలంలో వీటికి ఆదరణ, ప్రాధాన్యత పెరుగుతూ ఉన్నాయి. ఇండ్లలో భద్రత అంతంతమాత్రంగా ఉండటం కూడా ఈ లాకర్ల గిరాకీని అమాంతం పెంచేసింది. మరి లాకర్లలో ఏయే రకాలుంటాయి? వాటికి వర్తించే చార్జీలు ఎలా ఉంటాయి? అన్న వివరాలు తెలుసా? అయితే మీ కోసమే ఇది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్బీ) వంటి ప్రభుత్వ రంగ బ్యాంకులు, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో లాకర్లు, వాటి చార్జీల గురించి తెలుసుకుందాం.

ఇదీ సంగతి..

లాకర్ పరిమాణం, గ్రామీణ, పట్టణ, నగర, మెట్రో నగరాలనుబట్టి లాకర్ల చార్జీలు మారుతూ ఉంటాయి. బ్యాంక్ పాలసీలపైనా ఇవి ఆధారపడి ఉంటాయి. ఆయా బ్యాంకుల్లో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) కూడా అదనంగా పడుతుంది. ఇక అటు ఖాతాదారులు, ఇటు బ్యాంకర్లు లాకర్ల విషయంలో బాధ్యతాయుతంగా ఉండాల్సి ఉంటుంది. షరతులు వర్తిస్తాయి. లాకర్లు అందుబాటులో ఉంటేనే ఖాతాదారులకు బ్యాంకులు ఇవ్వడం జరుగుతుంది. కస్టమర్కు లాకర్ ఇవ్వాలా? వద్దా? అన్నది బ్యాంక్ శాఖదే తుది నిర్ణయం.

ఎస్బీఐలో..

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వన్-టైమ్ లాకర్ రిజిస్ట్రేషన్ ఫీజు చిన్న, మధ్యశ్రేణికిగాను రూ.500 (జీఎస్టీ అదనం) ఉంటుంది. భారీ, అతి భారీ లాకర్లకు ఈ ఫీజు రూ.1,000 (జీఎస్టీ అదనం)గా ఉన్నది. అలాగే లాకర్ సైజునుబట్టి వార్షిక చార్జీలు రూ.2,000 నుంచి రూ.12,000 వరకు ఉన్నాయి.

రకం	అర్బన్/మెట్రోల్లో
స్మాల్	రూ.2,000
మీడియం	రూ.4,000
లార్జ్	రూ.8,000
ఎక్స్ట్రా లార్జ్	రూ.12,000

హెచ్డీఎఫ్సీ బ్యాంక్లో..

ఒకే నగరం లేదా ప్రాంతంలో ఉన్నప్పటికీ హెచ్డీఎఫ్సీ బ్యాంక్ శాఖల్లో లాకర్ చార్జీలు వేర్వేరుగా ఉంటున్నాయి. అద్దెలు వార్షిక ప్రాతిపదికన చెల్లించాలి. అలాగే అడ్వాన్స్లూ ఉంటాయి. లాకర్ పరిమాణాన్నిబట్టి, బ్యాంక్ శాఖ, మెట్రో, అర్బన్, సెమీ-అర్బన్, గ్రామీణ ప్రాంతాల ఆధారంగా లాకర్ చార్జీలు వర్తిస్తాయి. కాబట్టి లాకర్ అవసరమనుకున్నవారు సమీపంలోని హెచ్డీఎఫ్సీ బ్యాంక్ శాఖను సంప్రదించడం ఉత్తమం. లాకర్ను బట్టి కనిష్ఠంగా రూ.1,100, గరిష్ఠంగా రూ.20,000 చార్జీలుంటాయి. ఇక చార్జీలపై 18 శాతం జీఎస్టీ కూడా పడుతుంది.

రకం	సెమీ అర్బన్	అర్బన్	మెట్రో
ఎక్స్ట్రా స్మాల్	రూ.1,100	రూ.1,100	రూ.1,350
స్మాల్	రూ.1,200	రూ.1,650	రూ.2,200
మీడియం	రూ.1,550	రూ.3,000	రూ.4,000
ఎక్స్ట్రా మీడియం	రూ.1,750	రూ.3,300	రూ.4,400
లార్జ్	రూ.4,000	రూ.7,000	రూ.10,000
ఎక్స్ట్రా లార్జ్	రూ.11,000	రూ.15,000	రూ.20,000

ఐసీఐసీఐ బ్యాంక్లో..

ఐసీఐసీఐ బ్యాంక్.. ఒకే నగరం, ప్రాంతంలో ఉన్నా లాకర్ అద్దె చార్జీల్లో వ్యత్యాసం కనిపిస్తుంది. కాబట్టి లాకర్ సైజ్, బ్యాంక్ ఉన్న చోటునుబట్టి చార్జీలుంటాయి. లాకర్ అద్దెను వార్షిక ప్రాతిపదికన తీసుకుంటారు. అడ్వాన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. లాకర్ అగ్రిమెంట్లో నిబంధనలు, షరతులు ఉంటాయి. వీటికి లోబడి కస్టమర్లు నడుచుకోవాలి.

రకం	సెమీ అర్బన్	అర్బన్	మెట్రో	మెట్రోప్లస్
స్మాల్	రూ.2,000	రూ.3,000	రూ.3,500	రూ.4,000
మీడియం	రూ.5,000	రూ.6,000	రూ.7,500	రూ.9,000
లార్జ్	రూ.7,000	రూ.10,000	రూ.13,000	రూ.15,000
ఎక్స్ట్రా లార్జ్	రూ.15,000	రూ.16,000	రూ.20,000	రూ.22,000

పంజాబ్ నేషనల్ బ్యాంక్లో..

పంజాబ్ నేషనల్ బ్యాంక్లో గ్రామీణ, పట్టణ శాఖల్లో వన్-టైమ్ లాకర్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200గా ఉన్నది. నగర, మెట్రో నగరాల్లో రూ.500. వార్షిక చార్జీలు లాకర్ సైజునుబట్టి రూ.1,250 నుంచి రూ.10,000 వరకు ఉంటాయి.

రకం	సెమీ అర్బన్	అర్బన్/మెట్రోల్లో
స్మాల్	రూ.1,250	రూ.2,000
మీడియం	రూ.2,500	రూ.3,500
లార్జ్	రూ.3,000	రూ.5,500
వెరీ లార్జ్	రూ.6,000	రూ.8,000
ఎక్స్ట్రా లార్జ్	రూ.10,000	రూ.10,000

ఎస్టేట్ ప్లానింగ్ తెలుసా?

పర్సనల్ ఫైనాన్స్లో ఎస్టేట్ ప్లానింగ్ ఎంతో కీలకమైన అంశం. మీ తదనంతరం మీ వారసులకు మీ కష్టార్జితాన్ని సాఫీగా బదిలీ చేయడంలో ఎస్టేట్ ప్లానింగ్దే ప్రధాన పాత్ర. కుటుంబ పెద్ద చనిపోయాక.. ఆ కుటుంబ సభ్యులు ఆస్తి తగాదాల్లో ఏ స్థాయిలో కొట్లాడుకుంటున్నారో చూస్తూనే ఉన్నాం. కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇళ్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నవారెందరో. ఇంకొందరైతే ఆస్తి తగాదాలతో కత్తులు దూసుకుంటున్నారు. హత్యలు చేసి జైలుపాలవుతున్నారు. ఈ అనర్థాలన్నింటికీ ఏమాత్రం వీల్లేకుండా ఎస్టేట్ ప్లానింగ్తో చెక్ పెట్టవచ్చు.

వీలునామా

దేశీయంగా ఆస్తుల పంపకాల్లో విస్తృతంగా వినియోగించేది వీలునామా. స్థిరచరాస్తులను తన మరణానంతరం ఎవరికేది అని వ్రాతపూర్వకంగా నిర్ణయించేదే వీలునామా. అయితే ఏ ఆస్తులనైతే పంచుతున్నారో ఆ ఆస్తుల యజమాని సంతకం దీనిపై ఉండాలి. అంతేగాక ఇద్దరు సాక్షుల సమక్షంలో ఈ ప్రక్రియ జరిగినప్పుడే దానికి విలువ ఉంటుంది.

ట్రస్ట్ ఏర్పాటు

చాలా సంపన్న కుటుంబాల్లో తమ అత్యంత విలువైన సంపదను లేదా ఆస్తులను వారసులకు ఇవ్వడానికి ముందు ఓ ట్రస్ట్ను ఏర్పాటుచేసి దానికి ఆ మొత్తాన్ని యజమానులు అప్పగిస్తారు. వారసులు మైనర్లు అయినప్పుడు లేదా దివ్యాంగులై ఇతరుల మీద ఆధారపడినప్పుడు ట్రస్ట్ల ఆలోచన సరైనదని చెప్పవచ్చు. ఇక మరికొన్ని సందర్భాల్లో వారసుల సామర్థ్యాన్ని పరీక్షించేందుకు కూడా యజమానులు ఈ ట్రస్టులపైనే ఆధారపడుతారు.

నామినేషన్

ఆస్తుల బదిలీ ప్రక్రియ సజావుగా సాగడానికి నామినీల నమోదు చాలా ముఖ్యం. బ్యాంక్ ఖాతాలు, మ్యూచువల్ ఫండ్స్, ఇన్సూరెన్స్ పాలసీల వంటి ఆర్థిక సాధనాల్లో అప్డేటెడ్ నామినేషన్ కీలకం. అప్పుడే మీ తదనంతరం ఆ సొమ్ము మీరు కోరుకున్నవారికి చెందుతుంది. లేదంటే కుటుంబ తగాదాలు, న్యాయపరమైన చిక్కులు తప్పవు.

ఉమ్మడి యాజమాన్యం

ఆస్తులు లేదా బ్యాంక్ ఖాతాలను పిల్లలు లేక భాగస్వామితో కలిసి సంయుక్తంగా నడిపించవచ్చు. జాయింట్ ఓనర్షిప్తో మరణానంతరం ఆస్తులు, నగదు బదిలీకి మార్గం సుగమమవుతుంది. అయితే కొన్ని పత్రాలు, చట్టాలకు లోబడి ఇదంతా జరుగుతుంది.

చివరగా..

అప్డేట్ ఎస్టేట్ ప్లానింగ్ డాక్యుమెంట్లను తరచూ లేదా జీవితంలో కీలక మార్పులు, పరిణామాలు ఎదురైనప్పుడు సమీక్షించుకోవడం అవసరం. న్యాయ, ఆర్థిక నిపుణులు సలహాలతో ఎస్టేట్ ప్లానింగ్ చేసుకోవడం ఉత్తమం. అప్పుడే న్యాయపరమైన, పన్నులకు సంబంధించిన ఇబ్బందులు దరిచేరవు.

జీడీపీ గణాంకాలే దిక్సూచి

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లలో అల్లకల్లోలం కొనసాగుతున్నది. జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు మదుపరులను ప్రభావితం చేస్తున్నాయి. గత వారం స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదొడుకుల నడుమ నష్టాలనే మూటగట్టుకున్నాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 609.51 పాయింట్లు లేదా 0.74 శాతం కోల్పోయి 81,721.08 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 166.65 పాయింట్లు లేదా 0.66 శాతం పడిపోయి 24,853.15 దగ్గర ముగిసింది. దీంతో ఈ వారం కూడా సూచీలు హెచ్చుతగ్గులకు లోనుకావచ్చన్న అంచనాలైతే ఉన్నాయి. ఈ జనవరి-మార్చి, 2024-25కుగాను దేశ జీడీపీ గణాంకాలు ఈ నెల 30న విడుదలవుతున్నాయి. దీంతో సహజంగానే ట్రేడింగ్ ప్రభావితం కానున్నది.

గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్తో కూడుకున్నవి. ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.